# విద్యార్థులు 100 శాతం హాజరు ఉండాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మానకొండూర్ బాలికల ఉన్నత పాఠశాల సందర్శన




కరీంనగర్, జనతా న్యూస్: ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం మంది విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మానకొండూర్ లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల బాలికలు తయారు చేసిన మట్టి గణపతులను పరిశీలించి అభినందించారు. అనంతరం 8వ తరగతి గదిని సందర్శించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. అప్పటికే తరగతిలో ఉపాధ్యాయుడు ఫిజికల్ సైన్స్ బోధిస్తుండడంతో ఆ పాఠానికి సంబంధించిన ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులతో పాఠాలు చదివించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి హాజరు పెంచాలన్నారు.

**భవిత కేంద్రం సందర్శన**

మానకొండూర్ లోని భవిత కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సందర్శించారు. దివ్యాంగ విద్యార్థులకు బోధిస్తున్న తీరును పరిశీలించారు. పలువురు విద్యార్థులతో మాట్లాడారు. ఈ నెలలో బోధిస్తున్న అంశాలు, సిలబస్ గురించి ఉపాధ్యాయురాలిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఫిజియోథెరపిస్టు, స్పీచ్ థెరపీ సేవలను క్రమం తప్పకుండా అందించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో తహసిల్దార్ విజయ్, ఎం ఈ ఓ మధుసూదనాచారి, ఎంపీడీవో వరలక్ష్మి, భవిత సెంటర్ ఇంచార్జి జ్యోతి, కార్యదర్శి రేవంత్ ఉన్నారు.

# ప్రజావాణికి 328 దరఖాస్తులు



కరీంనగర్, జనతా న్యూస్: కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 328 మంది అర్జీదారులు దరఖాస్తులు సమర్పించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు బదిలీ చేస్తూ దరఖాస్తులను వెనువెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ఆన్లైన్లోని పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు.

**జిల్లా అధికారులతో సమావేశం**

ప్రజావాణి అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ పమేలా సత్పతి సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎవరైనా కొత్తగా దరఖాస్తులు ఇస్తే స్వీకరించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఇండ్లు మంజూరై నిర్మించేందుకు సుముఖత వ్యక్తం చేయని లబ్ధిదారుల స్థానంలో అర్హులైన దరఖాస్తుదారులకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని సూచించారు. ఎంపీడీవోలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ దశలను ఆన్లైన్లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. 15 సంవత్సరాలు నిండిన బాలికలు, 50 సంవత్సరాలు పైబడిన మహిళలు, దివ్యాంగులను స్వయం సహాయక సంఘాల్లో చేర్పించాలని డి ఆర్ డి ఓ, మెప్మా పీడీలను ఆదేశించారు. ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలలో చదివే బాలికలను ఈ సంఘాల్లో చేర్పించాలని అన్నారు. గ్రూపులలో చేరడం ద్వారా విద్యార్థులకు సమావేశాలు, అకౌంట్స్, బిజినెస్ స్కిల్ వంటి వాటిల్లో అవగాహన వస్తుందని తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉల్ నబి పండగల నేపథ్యంలో ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. రోడ్లపై, మురుగు కాలువల్లో ఉన్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు.

మండల ప్రత్యేక అధికారులు రానున్న వారం రోజుల్లో అన్ని ప్రభుత్వ వసతి గృహాలను సందర్శించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, డి ఆర్ వో వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు పాల్గొన్నారు.

# యాత్రకు ప్రజలకు ఒరిగిందేమీ లేదు



### కాంగ్రెస్ ది ప్రజా క్షోభాయాత్ర

### బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడి రామకృష్ణారావు

తిమ్మాపూర్, జనతా న్యూస్ తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మంత్రులు, కాంగ్రెస్ నాయకులు చేపట్టిన ప్రజాహితయాత్ర ద్వారా తెలంగాణ ప్రజలకు జిల్లా ప్రజలకు ఒరిగిందేమీ లేదని జివి రామకృష్ణారావు అన్నారు. మానకొండూరు నియోజకవర్గ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు సోమ వారం మీడియాతో మాట్లాడారు.

ప్రజా సమస్యలు తెలుసుకోకుండా ఏసీ వాహనాల్లో వచ్చి కేవలం ఒక గ్రామంలోనే ర్యాలీ లాగా వెళ్లి యాత్ర చేపట్టినట్లు చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఇది జనహితయాత్ర కాదని జన క్షోభ యాత్రయాన్ని ఆయన అభివర్ణించారు. రాష్ట్రంలో యూరియా సంక్షోభం కాంగ్రెస్ నాయకులకు కనబడుట లేదా అని, దీనిపై ఎందుకు మాట్లాడడం లేదంటూ ప్రశ్నించారు.

బిజెపి కాంగ్రెస్ రాజకీయ క్రీడలో తెలంగాణ ప్రజలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. బలహీనంగా ఉన్న కాంగ్రెస్ను బలోపేతం చేసుకోవడానికి చేపట్టిన యాత్రల ఉందని అన్నారు. నటరాజన్ ఆరు నిమిషాలు మాట్లాడితే రాహుల్ సోనియా గురించి పొగడమే తప్ప, అనుభవాలు, ప్రజా సమస్యలపై మాట్లాడింది లేదని అన్నారు.

బీఆర్ఎస్ పార్టీ నాయకులు అంటేనే భయపడుతున్నారని అందుకే ముందస్తుగా అరెస్టు చేసి యాత్రలు చేపట్టారని నటరాజనుకు నిజాలు తెలుస్తాయని అరెస్టు చేశారని, అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

రాష్ట్రంలో అధికారంలో ఉండి ముఖ్యమంత్రి ఉండగా ఇన్చార్జి పాదయాత్రలు ఎందుకు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఐక్యత కోల్పోయి

కాంగ్రెస్ మక్కలైందని రాహుల్ గమనించి నటరాజన్ను పంపిస్తున్నాడని చెప్పారు. చొప్పదండి నియోజకవర్గం లో ఉన్న

లక్ష్మీ పంప్ హౌస్ను ఎందుకు చూడలేదని ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరం నీళ్లు వృధా పోయేలా చూసిన కాంగ్రెస్ నాయకులు ఎల్ఎండి, మిడ్ మానేరు ను ఎందుకు నింపలేదని ప్రశ్నించారు.

కేవలం కేసీఆర్ ను బదనం చేయడానికి కాంగ్రెస్ నాయకులు రైతులకు అన్యాయం చేశారని ఆయన విమర్శించారు.

ఇప్పటికైనా వరంగల్ సభ కంటే ముందే నటరాజన్, మంత్రులు క్షమాపణ చెప్పాలని న కాంగ్రెస్ నాయకులను ఆయన డిమాండ్ చేశారు. కేటీఆర్ పట్ల చొప్పదండి ఎమ్మెల్యే మాట్లాడిన తీరు బాగాలేదని, ఇప్పటికైనా జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు. అధికారులు యాత్ర వెంట ఉంటూ అట్టహాసం చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు.

ఈ మీడియా సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ జెడ్పిటిసి శేఖర్ గౌడ్, రొడ్డ యాదగిరి, నెల్లి శంకర్, ఎరుకల శ్రీనివాస్, గుర్రం కిరణ్ గౌడ్ మల్లయ్య, మర్రి కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ దూపదీప అర్చక చైర్మన్‌గా శ్రీనివాస సుదర్శన్



హైదరాబాద్, జనతా న్యూస్: దూపదీప నైవైద్య తెలంగాణ అర్చక సంఘం రాష్ట్ర చైర్మన్ గా శ్రీనివాస సుదర్శన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్ లో జరిగిన సమావేశంలో తెలంగాణ అర్చక సభ్యులందరూ శ్రీనివాస సుదర్శన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో కూడా శ్రీనివాస సుదర్శన్ చైర్మన్ గా కూడా పనిచేశారు. సభ్యుల సహకారంతో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని శ్రీనివాస సుదర్శన్ తెలిపారు. సభ్యులు తమ సమస్యలను తనకు ఎప్పటికప్పుడు తెలియచేస్తే ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకొని వెళ్లి అర్చకుల అభివృద్ధికి కృషి చేస్తానని శ్రీనివాస సుదర్శన్ తెలిపారు. కరీంనగర్ జిల్లా గుమ్ములాపూర్ వాసి సుదర్శన్. ఆయన ఏక గ్రీవ ఎన్నిక పట్ల పలువురు అబినందనలు తెలిపారు.

# రైతులను ఇబ్బంది పెట్టడమే నా? ప్రజాపాలన!

**బిఆర్ఎస్ నాయకులు దిటి రాజు.**





జనత న్యూస్ బెజ్జంకి : యూరియా సప్లై చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని, రైతులను ఇబ్బందులకు గురి చేయడమే ప్రజా పాలన అని బిఆర్ఎస్ నాయకులు మరియు మాజీ ఏఎంసి డైరెక్టర్ దీటి రాజు సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విచ్చలవిడిగా లిక్కర్ దొరుకుతుంది, కానీ అన్నం పెట్టే రైతుకు ఎరువులు దొరకడం లేదని అన్నారు. యూరియా తయారు చేయడంలో రసాయనాల కోరుతా ఉందని ఒక కుంటి సాకు చెప్పి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఆడుతున్న నాటకం అని దుయ్యబట్టారు. మండల కేంద్రంలో రైతులు ఉదయం 3,4 గంటల నుండి యూరియా కోసం నిరీక్షించే పరిస్థితి తీసుకొచ్చి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పది సంవత్సరాల కెసిఆర్ పాలనలో రైతులు ఇబ్బందులు పడ్డ దాఖలాలు లేవని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ రైతులు మరియు తెలంగాణ సమాజం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెబుతాయని తెలిపారు.

# కేంద్రం నిధులు విడుదల చేయాలి

### మానసిక వికలాంగుల పాఠశాల చైర్మన్ చాడ వెంకటరెడ్డి



తిమ్మాపూర్, జనతా న్యూస్ : స్వా తంత్ర సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల పాఠశాలకు కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులు త్వరగా విడుదల చేయాలని ట్రస్ట్ చైర్మన్ చాడ వెంకటరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎల్ఎండి కాలనీలో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల పాఠశాలకు నిధుల కొరత తీవ్రంగా ఉందని, కేంద్ర ప్రభుత్వం 2024 25 సంవత్సరానికి ఇవ్వాల్సిన నిధులను ఇప్పటివరకు ఇవ్వలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిధులు ఇవ్వాలని తాము కోరితే 50 లక్షలు విడుదల చేసినట్లు జీవో జారీ చేశారని రాష్ట్ర ప్రభుత్వానికి ట్రస్ట్ తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వని కారణంగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతోపాటు ప్రస్తుత రంగా పాఠశాల నిర్వహణ కొనసాగుతుందని ఆయన తెలిపారు. సేవా దృక్పథంతో పాఠశాలను కొనసాగిస్తున్నామని తప్పకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే నిధులు ఇవ్వాలని కేంద్ర సహాయక మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కి లేఖ రాస్తామని చాడ వెంకటరెడ్డి తెలిపారు. 35 మంది ఉద్యోగులు పనిచేస్తున్న ఈ పాఠశాలలో 127 మంది మానసిక విద్యార్థులు ఉన్నారని, వీరిలో 70 మందికి హాస్టల్ వసతిని కల్పిస్తున్నట్లు, వీరందరికీ ఉచిత భోజనం తో పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, అలాగే ఒకేషనల్ కోర్సులను సైతం నిర్వహిస్తూ వస్తువులను ఇక్కడే తయారు చేస్తున్నామని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ట్రస్ట్ సభ్యులు కొమురెల్లారెడ్డి, బి. వెంకటయ్య, భగవాన్, మధుసూదన్ రావు, ప్రిన్సిపల్ సతీష్, అడ్మినిస్ట్రేటివ్ బాలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

